ఇంటి పరిసరాలలో నీటిని నిల్వ ఉంచొద్దు

అవగాహన కార్యక్రమంలో డీసీ జకియా సుల్తానా



దోమల నివారణపై అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డీసీ జకియా సుల్తానా

చంపాపేట: ఇంటి పరిసరాలలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతీ వ్యక్తిపై ఉందని ఎల్‌బీనగర్ సర్కిల్ డీసీ జకియా సుల్తానా అన్నారు. జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు శుక్రవారం చంపాపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సర్కిల్ ఎంటమాలజీ అధికారి మణి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దోమల నివారణపై అవగాహనా కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జకియా సుల్తానా మాట్లాడుతూ మలేరియా, డెంగీ, చికున్ గున్యా, బోధకాలు వంటి సీజనల్ వ్యాధుల పట్ల కాలనీవాసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. దోమలు వృద్ధి చేసేందుకు ఆస్కారం ఉన్న స్థలాలు, దోమ కాటు వల్ల వచ్చే ప్రాణాంతక వ్యాధుల గురించి తమ పాఠ్యాంశాలలో నేర్చుకున్న విషయాలను తల్లిదండ్రులకు, పరిసర కాలనీవాసులకు వివరించాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంటమాలజీ సూపర్‌వైజర్ పెంటయ్య, డీఈ వెంకటేశ్వర్లు, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

అనునిత్యం సేవకుడిగా మీ ముందుంటా

మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి



పార్కు ప్రహరీగోడను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: ప్రజా సమస్యల పరిష్కారానికి అనునిత్యం సేవకుడిగా మీ ముందుంటానని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. డివిజన్ హయత్‌నగర్ పరిధి సిరిహిల్స్‌కాలనీలో నూతనంగా నిర్మించిన పార్కు ప్రహరీగోడను శుక్రవారం కార్పొరేటర్ ప్రారంభించి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలోని పార్కు స్థలాలు కబ్జాకు గురికాకుండా కాపాడుతున్నట్లు స్పష్టం చేశారు. కాలనీలలో సమస్యలను తన దృష్టికి తీసుకవచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. కాలనీలలో మొక్కలు విరివిగా నాటి వాటిని సంరక్షించుకోవాలని, పర్యావరణ పరిరక్షణ ధ్యేయంగా ముందుకు వెళ్దామని కోరారు. సిరిహిల్స్‌కాలనీలో మిగిలిపోయిన సీసీ రోడ్ల నిర్మాణానికి చర్యలు చేపడుతానని, అదేవిధంగా డ్రైనేజీ ట్రంక్‌లైన్ పూర్తికాగానే అంతర్గత డ్రైనేజీ లింక్ పనులను చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు రవీంద్రారెడ్డి, శ్రీనివాస్ నాయక్, వెంకటేష్‌గౌడ్, బాల్‌రెడ్డి, శంకర్‌గౌడ్, మురళీ, ఆనంద్‌రెడ్డి, చారి, ప్రసాద్, నాయకులు కడారియాదగిరి యాదవ్, శ్యాం సుందర్‌రెడ్డి, పాతూరి శ్రీధర్‌గౌడ్, జయతేజ, రోహిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దుర్వాసన రాకుండాచర్యలు

మన్సూరాబాద్ పెద్దచెరువులోకి మురుగు నీరు చేరుతుండటంతో తీవ్ర దుర్వాసన వస్తుందని వాకర్స్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. కార్పొరేటర్ స్పందించి హయత్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్యతో కలసి శుక్రవారం ఉదయం పెద్దచెరువును సందర్శించారు. రానున్న 24 గంటలలోపు సమస్యను పరిష్కరించి మళ్లీ పునరావృతం కాకుండా చర్యలు చేపడుతామని వాకర్స్‌కు కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మారెడ్డి, డీసీ తిప్పర్తి యాదయ్యలు హామీ ఇచ్చారు.

మర్యాదపూర్వక కలయిక

మన్సూరాబాద్: తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ)గా బాధ్యతలు స్వీకరించిన జితేందర్‌ను గిన్నిస్ వరల్డ్ రికార్డ్ హోల్డర్ (4 టైమ్స్), రచయిత, సామాజిక కార్యకర్త డా. పెండెం కృష్ణకుమార్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పర్యావరణ రక్షణకు ప్లాస్టిక్ వాడకం తగ్గించి క్లాత్ సంచులకు వాడాలనే అవగాహన కల్పించే క్లాత్ సంచులను అందజేశారు. కళాత్మక ఫొటోలతో ఉన్న క్యాలెండర్‌ను ఆయన డీజీపీకి బహూకరించారు.



రాష్ట్ర డీజీపీని కలసి క్లాత్ బ్యాగులను బహూకరిస్తున్న డా. పెండెం కృష్ణకుమార్

అధికారుల ఆదేశాలతో తనిఖీలు



ఇన్‌స్పెక్టర్ రాజు

చాదర్‌ఘాట్: నగర కమిషనర్ ఆదేశాల మేరకు ప్రతిరోజు వాహనాల తనిఖీలు నిర్వహిస్తామని చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ ఎం.రాజు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం స్టేషన్‌లో మాట్లాడుతూ వాహనాల తనిఖీలతో పాటు అనుమానితుల పైనా నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు. ఫ్లై ఓవర్లపై బైక్ రైడింగ్‌లు, బైక్‌లు నిలిపి ఇబ్బందులు కల్గించడంపై నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు. బోనాలు, మొహర్రం పండుగల నేపథ్యంలో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్నామని తెలిపారు. సోషల్ మీడియాలో వస్తున్న పుకార్లను నమ్మవద్దని అన్నారు. పండుగలు పురస్కరించుకొని పీస్ కమిటీ మీటింగ్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. పీస్ కమిటీ వారికి పండుగల సమయంలో ఏవిధంగా నడుచుకోవాలో సూచనలు చేస్తామని తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



మొక్కలు నాటుతున్న మల్‌రెడ్డి రాంరెడ్డి కార్పొరేటర్ సుజాతనాయక్

హస్తినాపురం: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని తెలంగాణ రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. శుక్రవారం హస్తినాపురం డివిజన్ పరిధిలోని ఇంద్రప్రస్థకాలనీ ఫేజ్–1లో అర్బన్ బయోడైవర్సిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వన మహోత్సవ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ సుజాతనాయక్‌తో కలసి రాంరెడ్డి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు పెంచడం ద్వారా పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుందని ప్రతి ఒక్కరూ ఇంటింటికీ ఒక మొక్క చొప్పున నాటి సంరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అర్బన్ బయోడైవర్సిటీ డిప్యూటీ డైరెక్టర్‌లు చంద్రశేఖర్‌రావు, సత్యనారాయణ, ఎల్‌బీనగర్ సర్కిల్ డీసీ జకియా సుల్తానా, ఏఈ హేమూనాయక్, నాయకులు వెదిరె యోగీశ్వర్‌రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి రామ్‌రెడ్డి యాదగిరిరెడ్డి, గణేశ్, మధు, మురళి, దిండి శశిధర్‌రెడ్డి, వెంకట్రాంరెడ్డి, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కిరన్, మంజులారెడ్డి, శివ,బద్రి, అస్లాం, షాకీర్, నరసింహ, శీనునాయక్, సతీష్‌గౌడ్, శేఖర్‌రెడ్డి, బ్రహ్మారెడ్డి, మమతా మల్లేశ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

భాష్యంలో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు



బహుమతులు అందజేస్తున్న భాష్యం విద్యాసంస్థల జడ్‌ఈఓ అంకమ్మరావు, ప్రిన్సిపాల్

మన్సూరాబాద్: భాష్యం విద్యాసంస్థలల్లో విద్యార్థులకు చదువుతోపాటు భారతీయ సంప్రదాయాల విశిష్టతలను నేర్పుతారని విద్యాసంస్థల జడ్‌ఈఓ అంకమ్మరావు అన్నారు. శుక్రవారం వనస్థలిపురం భాష్యం ఫ్రెషర్స్ డే వేడుకలను మన్సూరాబాద్ చింతలకుంటలోని పల్లవి గార్డెన్స్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భాష్యం విద్యాసంస్థల జడ్‌ఈఓ అంకమ్మరావు హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ విద్యాసంస్థల్లో నాణ్యతతోకూడా విద్యాబోధన జరుగుతుందన్నారు. పాఠశాలలో చేరిన విద్యార్థులకు ఆశీస్సులతోపాటు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సుజాత, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సహకారంతో..

చంపాపేట: ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి సహకారంతోనే చంపాపేటలోని పలు కాలనీలలో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు ముడుపు రాజిరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన డివిజన్ పరిధిలోని మాధవనగర్ కాలనీలో ప్రారంభించిన సీసీ రోడ్ల పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసుల బెనర్జీ, శంభుప్రసాద్, నాయకులు ఉమామహేశ్వర్, యాదయ్య, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో ఏళ్లతరబడి ఖాళీలు!

- అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల నియామకాల్లో మీనమేషాలు
- టీచర్లు, ఆయాలు లేకపోవటంతో ఇన్‌చార్జ్‌లతో నెట్టుకొస్తున్న వైనం
- అధికారుల నిర్లక్ష్యంతో కుంటుపడుతున్న వ్యవస్థ



చాదర్‌ఘాట్: చిన్నారులకు ఓనమాలు దిద్దించడం, గర్భిణిలకు పోషకాహారాలు అందించడంతోపాటు జాగ్రత్తలు, సూచనలు చేయడంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు (హెల్పర్లు) పాత్ర కీలకం. ప్రతీ అంగన్‌వాడీ కేంద్రంలోనూ టీచర్‌తో పాటు ఆయా తప్పనిసరిగా ఉంటేనే ఆ కేంద్రంలో లబ్ధిదారులకు మేలు చేకూరుతుంది. ఇందులో ఏ ఒక్కరు లేకపోయినా ఆ అంగన్‌వాడీ కేంద్రం పనితీరు అధ్వానంగా మారుతుంది. అయితే సమగ్ర శిశు అభివృద్ధి పథకం (ఐసీడీఎస్) మలక్‌పేట పరిధిలో 274 అంగన్‌వాడీ కేంద్రాలు, 14 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. చాలా చోట్ల ఆయాల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిని భర్తీ చేయటంలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. కొన్ని చోట్ల ఏళ్లతరబడి ఆయాలు లేకుండానే కేంద్రాలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆయాలు చేయాల్సిన పనులు అంగన్‌వాడీ టీచర్లు చేయమాల్సి వస్తోంది. పొరపాటున సంబంధిత అంగన్‌వాడీ టీచర్లు సర్వే చేయడానికో, శిక్షణ తీసుకోవటానికో వెళితే ఆరోజు అంగన్‌వాడీ కేంద్రానికి తాళం పడాల్సిందే.

◆ చిన్నారులకు ఓనమాలు దిద్దించడంతో పాటు పాటు గుడ్లు, పాలు బాలామృతం వంటి పోషకాహారాన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తుంటారు. ఉదయం 8 గంటలకే ఆయాలు కేంద్రానికి చేరుకొని ప్రాంగణాన్ని శుభ్రం చేసి పోషకాహారం వండుతూనే కేంద్రానికి వచ్చే పిల్లలకు పాలు అందించి ఆట వస్తువులను ఏర్పాటు చేస్తారు.

◆ చాలా చోట్ల ఆయాలు లేకపోవటం చేత ఈ వ్యవస్థ కుంటుపడుతుంది. మలక్‌పేటసెక్టార్‌లో దాదాపు 20 ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అంతే కాకుండా 15 చోట్ల అంగన్‌వాడీ టీచర్లు కూడా లేకపోవడంతో ఇన్‌చార్జ్‌లతోనే నెట్టుకొస్తున్నారు. ఐసీడీఎస్ అధికారులు ఆయా అంగన్‌వాడీ పోస్టులు భర్తీ చేయడం ద్వారా కొంతమంది మహిళలకైనా ఉపాధి కల్పించే అవకాశాలు ఉన్నా అధికారులు పట్టించుకున్న పాపాన పోవడం లేదని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పోస్టులు భర్తీ చేయాలని కోరుతున్నారు.

కమిషనర్‌కు వినతి



కమిషనర్ అమ్రపాలికి వినతిపత్రం అందజేస్తున్న నవజీవన్‌రెడ్డి

హయత్‌నగర్: డివిజన్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు తగిన నిధులు మంజూరు చేయాలని కోరుతూ హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి గ్రేటర్ కమిషనర్ అమ్రపాలికి వినతి పత్రం సమర్పించారు. గ్రేటర్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన అమ్రపాలిని శుక్రవారం ఆయన కమిషనర్ కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా హయత్‌నగర్‌లో నివావాసలు పెరుగుతున్న నేపథ్యంలో తగిన సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.

మంత్రి వెంకట్‌రెడ్డికి మల్‌రెడ్డి రాంరెడ్డి వినతి



మంత్రి వెంకట్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న మల్‌రెడ్డి రాంరెడ్డి

ఎల్‌బీనగర్: జాతీయ రహదారి విస్తరణలో భాగంగా పనామ, ఆటోనగర్, హయత్‌నగర్ వద్ద నిర్మించే అండర్‌పాస్‌లకు బదులుగా ఫ్లై ఓవర్ నిర్మాణం చేపట్టాలని రోడ్ల అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి కోరారు. ఎర్రమంజిల్ ఆర్‌అండ్‌బీ భవనంలో మల్‌రెడ్డి రాంరెడ్డి శుక్రవారం రోడ్లు,, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ స్పెషల్ సెక్రటరీ హరిచందన దాసరితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మల్‌రెడ్డి రాంరెడ్డి ఫ్లైఓవర్ నిర్మాణానికి అవసరమయ్యే అదనపు నిధులు మంజూరు చేయాలని మంత్రికి వినతి పత్రం అందజేశారు.

శుభాకాంక్షలు

లింగోజిగూడ: రోడ్ల అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు తీసుకున్న సందర్భంగా మల్‌రెడ్డి రాంరెడ్డిని శుక్రవారం లింగోజిగూడ డివిజన్ కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు శ్రీధర్‌గౌడ్, జైపాల్‌రెడ్డి సుధీర్‌రెడ్డి, కరుణ్‌కుమార్, ప్రవీణ్‌రెడ్డి, రోహిత్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి కోసమే బీజేపీకి పట్టం

సైదాబాద్: అభివృద్ధిని కాంక్షించిన దేశ ప్రజలు బీజేపీకి మరోసారి పట్టం కట్టారని బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధికార ప్రతినిధి, యాకత్‌పురా నియోజకవర్గ కాంటెస్టెడ్ బీజేపీ అభ్యర్థి వీరేంద్రబాబు యాదవ్ అన్నారు. ఐఎస్‌సదన్ డివిజన్ వినయ్‌నగర్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఆయన ఆధ్వర్యంలో ఓటర్లకు అభినందన సభ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఆదరించిన ఓటర్లు, సీనియర్ నాయకులను అభినందించడానికి ఈ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. అనంతరం విష్ణునగర్‌కు చెందిన సీనియర్ నాయకుడు బిక్షపతి సహా పలువురు నాయకులను ఆయన పార్టీ నేతలతో కలసి సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి, ఐఎస్‌సదన్ కార్పొరేటర్ జంగం శ్వేతమధుకర్‌రెడ్డి తదితరులున్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలకు లబ్ధి

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



ఎల్‌ఓసీ చెక్కును బాధితులకు అందజేస్తున్న దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

నాగోలు: సీఎం రిలీఫ్ ఫండ్‌తో ఎంతో మంది పేదలకు లబ్ధి చేకూరుతుందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. నాగోలు డివిజన్ పరిధిలోని మమతనగర్‌కు చెందిన వంశీకృష్ణ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న నేపథ్యంలో అతని ఆర్థిక పరిస్థితి బాగలేక పోవడంతో వారి కుటుంబ సభ్యులు ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని సంప్రదించారు. దీంతో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి వెంటనే స్పందించి వంశీకృష్ణ ఆపరేషన్‌కు కావలసిన డబ్బుల కోసం ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేయించారు. దీంతో వారికి రూ. 2 లక్షల రూపాయల మంజూరు అయ్యాయి. ఈ మేరకు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులకు ఎల్‌ఓసీ చెక్కు అందజేశారు. అనంతరం సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ పేదల ఆరోగ్య పరిరక్షణకు సీఎం సహాయ నిధి ఎంతో దోహదపడుతుందని అన్నారు. ఈ పథకం పేదలకు ఓ వరం లాంటిది అని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గుత్తా లక్ష్మారెడ్డి, చీర శ్రీనివాస్, శివ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మన్సూరాబాద్: టీజీఎస్ ఆర్టీసీ లాజిస్టిక్ విభాగం ఆధ్వర్యంలో కార్గో ఏజెంట్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆర్టీసీ కార్గో ఏజెంట్ డెవలప్‌మెంట్ మార్కెటింగ్ అధికారి మురళీధర్ తెలిపారు. హయత్‌నగర్, చార్మినార్ డివిజన్లలోని వివిధ డిపోల పరిధిలో పలు ప్రాంతాల్లో కార్గో ఏజెంట్లను నియమిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎల్‌బీనగర్, బీఎన్‌రెడ్డినగర్, సాగర్‌రింగ్‌రోడ్డు, దిల్‌సుఖ్‌నగర్, మలక్‌పేట్, ఆలీకేఫ్, కర్మన్‌ఘాట్, సంతోష్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఏజెంట్ల కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వివరాలకు 73861 87599, 91542 98781ను సంప్రదించాలన్నారు.

పార్కుల అభివృద్ధికి కృషి



పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: నియోజకవర్గంలోని పార్కులను అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని వైదేహినగర్ నార్త్ కాలనీలో రోడ్ నెం 1లోని పార్కును శుక్రవారం సుధీర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు పోగుల రాంబాబు మాట్లాడుతూ ఎమ్మెల్యే సహాయ, సహకారాలతో పార్కులో వాకింగ్ ట్రైల్స్ ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఓపెన్ జిమ్‌కు అవసరమైన వస్తువులను కూడా ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి, నాయకులు అనిల్ చౌదరి, బుచ్చిరెడ్డి, సతీష్‌గౌడ్, శివశంకర్, శ్రీకాంత్, మనోజ్, రాజేందర్‌రెడ్డి, నాగరాజ్, ఆదిత్య, వేణుగోపాల్, కృష్ణ, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు,

ఇంకుడు గుంతలతోనే భూగర్భ జలాలు పదిలం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సేవ్‌ఎర్త్ ఫౌండేషన్ ప్రతినిధులు

హస్తినాపురం: సహజ వనరుల సంరక్షణ పర్యావరణ పరిరక్షణ సామాజిక అంశాలపై విద్యార్థులకు భాగస్వాములను చేసి పాఠశాల స్థాయి నుంచే వారికి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని సేవ్ ఎర్త్ ఫౌండేషన్ ఫౌండర్ డాక్టర్ టి.సురేందర్ అన్నారు. హస్తినాపురం డివిజన్ పరిధిలోని లక్ష్మీనరసింహపురం కాలనీలోని కిండిల్ కిడ్స్ స్కూలు ఆవరణలో ఇంకుడు గుంతలను పునరుద్ధరించే కార్యక్రమాన్ని జలమండలి, సేవ్ ఎర్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సురేందర్ మాట్లాడుతూ భవిష్యత్ తరాల బాగు కోసం భూగర్భ జలాలను సంరక్షించుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వర్షపు నీటిని ఒడిసి పట్టుకునేందుకు ఇంకుడు గుంతలను ప్రతి ఒక్కరూ ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. తమ పరిసరాలలో ఏర్పాటు చేసుకున్న ఇంకుడు గుంతలను తరుచూ శుభ్రపరుచుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు ఇంకుడు గుంతల నిర్మాణం వాటి నిర్వహణ పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కిండిల్ కిడ్స్ స్కూలు చైర్మన్ మేడ గోపాల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ మేడ నందితరెడ్డి, ఉపాధ్యాయులు స్వాతి, అనూష, మాధవి, శిల్ప తదితరులు పాల్గొన్నారు.

ఆల్ ఇండియా హ్యాండ్లూమ్, హ్యాండీ క్రాఫ్ట్ మేళాకు ఆదరణ



ఆల్ ఇండియా హ్యాండ్లూమ్, హ్యాండీక్రాఫ్ట్ మేళాలో కొనుగోలుదారుల సందడి

వనస్థలిపురం: చేనేత వస్త్రాలు, చేతి వృత్తులను ఆదరించాల్సిన అవసరం ఉందని ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీక్రాఫ్ట్ మేళా (ఎగ్జిబిషన్ అండ్ సేల్) నిర్వాహకుడు అక్బర్ అలీ అన్నారు. వనస్థలిపురంలోని హుడా ఆడిటోరియం గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీక్రాఫ్ట్ మేళాకు స్థానికుల నుంచి మంచి ఆదరణ వస్తోందని అన్నారు. మేళాలో మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్, డిజైనర్, కాంతా వర్క్, హ్యాండ్ బ్లాక్ ప్రింటెడ్, లినెన్, కలంకారీ, బెంగాల్ కాటన్, లక్నో చికాన్, బనారస్ చీరలు, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ బ్లౌజెస్, ఖాదీ మెటీరియల్, వన్ గ్రామ్ గోల్డ్ జ్యువెల్లరీ, జైపూర్ బెడ్‌షీట్స్, కొండపల్లి బొమ్మలు, బ్యాగులు, చెప్పులు తదితర ఉత్పత్తులు తగ్గింపు ధరలకు లభిస్తాయని అన్నారు. ఈ అవకాశం కొద్ది రోజులు మాత్రమే ఉంటుందని ఆయన తెలిపారు.

ఆధ్యాత్మికత ఉట్టిపడేలా బోనాల పండుగ

మలక్‌పేట: ఆధ్యాత్మిక ఉట్టిపడేలా బోనాలు పండుగ జరుపుకోవాలని మూసారంబాగ్ కార్పొరేటర్ బి. భాగ్యలక్ష్మి మధుసూదన్ రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని అమ్మవారి ఆలయ నిర్వాహకులకు శుక్రవారం బోనాల పండుగ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆషాఢ మాస బోనాల పండుగకు అందించే నిధులు 10 శాతం పెంచడం హర్షణీయమన్నారు. బోనాలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. ఆలయాల వద్ద భక్తులు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ సురేఖ, గోవర్ధన్, ఆలయ కమిటీ సభ్యులు రవీందర్, మురళీ, యాదగిరి, హరి, వినయ్, ఉమేష్ తదితరులు ఉన్నారు.

వృత్తి శిక్షణతో మెండుగా ఉపాధి అవకాశాలు

సైదాబాద్: వృత్తి శిక్షణ కేంద్రాలలో తర్ఫీదు పొందటం ద్వారా మహిళలకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణరవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ స్కిల్ ఇండియా కార్యక్రమం కింద జన్ శిక్షణ సంస్థాన్ ఆధ్వర్యంలో సైదాబాద్ మూడు గుళ్ల చౌరస్తా వద్ద ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన వృత్తి శిక్షణ కేంద్రాన్ని కార్పొరేటర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకం ద్వారా ఏర్పాటు చేస్తున్న ఈ కేంద్రాలు మహిళలకు స్వయం ఉపాధి పొందే అవకాశాలను పెంపొందించడానికి దోహదపడుతాయని అన్నారు. ఈ వృత్తి శిక్షణ కేంద్రాలను అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేటర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఆఫీసర్ మాల కొండయ్య, జీహెచ్‌ఎంసీ మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్జీ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొత్తకాపు రవీందర్‌రెడ్డి, కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

మలక్‌పేట: సీఎం సహాయ నిధితో ఎంతోమంది పేదల రోగుల జీవితాల్లో వెలుగులు నిండుతున్నాయని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. పంజేషాహలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన 40 మంది లబ్ధిదారులకు సీఎం ఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎంఆర్‌ఎఫ్ పథకం నిరుపేద వర్గాలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. పంపిణీ చెక్కుల విలువ రూ.16,23,500 ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మజ్లీస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సత్కారం

మలక్‌పేట: సలీంనగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయం అధ్యక్షుడు తుమ్మలపల్లి రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డికి ఆత్మీయ సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్‌రెడ్డి, మూసారంబాగ్ కార్పొరేటర్ బి. భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి, సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణరవీందర్‌రెడ్డి, కాలనీవాసులు గవర్నర్‌ను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సందడి సురేందర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్‌తోపాటు కాలనీ వాసులు పాల్గొన్నారు.

మద్యం తాగొద్దన్నందుకు...

- వ్యక్తి ఆత్మహత్యాయత్నం
- కాపాడి కౌన్సెలింగ్ ఇచ్చిన చైతన్యపురి పోలీసులు

చైతన్యపురి: మద్యం తాగొద్దని కుటుంబ సభ్యులు మందలించినందుకు ఓ వ్యక్తి మూడంతస్తుల భవనం ఎక్కి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలు... సైదాబాద్‌లో నివసించే తాళ్లపల్లి రమేష్ (45) సెంట్రింగ్ పనులు చేస్తుండగా ఇటీవల మద్యానికి అలవాటుపడ్డాడు. దీంతో శుక్రవారం ఉదయం రమేష్ భార్య ధనలక్ష్మి, కుమారుడు రాకేష్ మద్యం సేవించవద్దని రమేష్‌ను మందలించారు. ఇంటి నుంచి బయటకు వచ్చిన రమేష్ మద్యం సేవించి దిల్‌సుఖ్‌నగర్ విద్యుత్‌నగర్‌కు వచ్చి నిర్మాణంలోని మూడంతస్తుల భవనంపై ఉన్న వాటర్ ట్యాంక్‌పైకి ఎక్కి దూకే ప్రయత్నం చేశాడు. గమనించిన స్థానికులు 100కు సమాచారం ఇవ్వడంతో చైతన్యపురి పోలీసులను అప్రమత్తం చేశారు. ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు తమ సిబ్బందితో అక్కడకు చేరుకొని రమేష్‌ను కిందకు దించే ప్రయత్నం చేశారు. ఎంతచెప్పినా కిందకు దిగకపోవటంతో పోలీసులు ట్యాంక్‌పైకి ఎక్కి కాపాడి స్టేషన్‌కు తీసుకొచ్చారు. అనంతరం రమేష్ కుటుంబ సభ్యులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి ఇంటికి పంపించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

హత్య కేసులో నిందితులకు జీవిత ఖైదు

రంగారెడ్డి కోర్టులు: వివాహితతో అక్రమ సంబంధం పెట్టుకొని హతమార్చిన ఇద్దరు నిందితులకు జీవిత ఖైదు తోపాటు రూ. 5వేలు జరిమానాను 4వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి జె. కవితా విధించిన సంఘటన చోటుచేసుకుంది. కోర్టు ఎపిపి గంగిరెడ్డి వివరాల ప్రకారం... ఆటోనగర్‌లో నివసించే వివాహిత అర్చనకు రాజ్‌కుమార్ (30) అనే యువకుడితో పరిచయం ఏర్పడింది. ఈ పరిచయం కాస్త వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఈ క్రమంలో రాజ్‌కుమార్ పెద్ద మొత్తంలో డబ్బు అడగగా అర్చన ససేమిరా అనడంతో నిందితుడి తన స్నేహితుడైన ముత్తు రాము సహాయంతో పథకం ప్రకారం 2016, జులై 28న అర్చనను గొంతు నలిమి హత్య చేశారు. కేసును దర్యాప్తు చేసిన పోలీసులు కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా, శాక్షులను విచారించిన కోర్టు నిందితులిద్దరికి శిక్ష ఖరారు చేస్తూ తీర్పు వెలువరించింది.